క్లుప్తంగా

రైతుల సమక్షంలో భూముల రీ సర్వే

• తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి



మ్యాప్ పరిశీలిస్తున్న తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి

గంట్యాడ: రైతుల సమక్షంలో భూముల రీ సర్వే చేయాలని తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని సిరిపురంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూములకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. వివాదాలు లేకుండా సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

• మండల ప్రత్యేకాధికారి సాల్మన్‌రాజు



రికార్డులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సాల్మన్‌రాజు

బొండపల్లి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు బాధ్యతగా పని చేయాలని మండల ప్రత్యేకాధికారి ఏపీ సాల్మన్‌రాజు అన్నారున. మండల కేంద్రంలోని సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రజా సేవ విషయంలో అలసత్వం పనికిరాదని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. తులసీదాస్, ఈఓపీఆర్‌డీ ఎ. రఘుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు




రావివలస నుంచి వెళ్లే దారిలో ప్రమాదకరంగా మారిన మలుపు

చీపురుపల్లి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మలుపులు ప్రమాదాలకు పిలుపుల్లా మారుతున్నాయి. మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని రావివలస పంచాయతీ కేంద్రం నుంచి కొత్తపేట, గురానపేట గ్రామాలకు వెళ్లే మూడు రోడ్ల జంక్షన్ ప్రమాదకరంగా తయారైంది. ఈ జంక్షన్ వద్ద ఉన్న మలుపులో కుడివైపు వెళితే కొత్తపేట.. ఎడమ వైపు వెళితే గురానపేట, తదితర గ్రామాలు ఉంటాయి. సరిగ్గా ఆ జంక్షన్ వద్ద మూడు రోడ్లను కలుపుతూ రహదారి ఉంది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సరిగ్గా అదే జంక్షన్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉండడంతో వాహనాలు ఢీ కొనే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మలుపు వద్ద హెచ్చరిక బోర్డు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు

• చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



జాతీయ రహదారిపై వెలిసిన దుకాణాలు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని పురిటిపెంట పంచాయతీ పరిధి ఆర్‌అండ్‌బీ పాత భవనాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను అధికార పార్టీ నాయకులు కొంతమంది ఆక్రమించారు. అంతటితో ఆగకుండా దుకాణాలు ఏర్పాటు చేసి దర్జాగా ఇతరులకు అద్దెకు ఇచ్చేశారు. స్థలాలు పంచాయతీవి కాగా.. అద్దెలు మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు చెందుతున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఇష్టారీతిలో ఆక్రమణలను చేపట్టినా సంబంధిత రెవెన్యూ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొంతమంది శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాల లేమి..

• పట్టించుకోని అధికారులు
• ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



చుక్క నీరివ్వని కుళాయిలు



గజపతినగరం రైల్వేస్టేషన్

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాల్సిన రైల్వే అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రతిరోజూ ఈ స్టేషన్ మీదుగా 115కు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అందులో సుమారు 50కు పైగా ప్యాసింజర్ రైళ్లు వచ్చిపోతుంటాయి. గజపతినగరం స్టేషన్ మీదుగా ఇటు విశాఖపట్నం మీదుగా హైదరాబాద్, తిరుపతి, చెన్నై వంటి మహా నగరాలకు.. అలాగే అటు రాయగడ, భువనేశ్వర్, కోల్‌కతా వంటి మహా నగరాలకు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా రైళ్ల ద్వారా ప్రయాణం చేసేందుకు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ఈ స్టేషన్‌కు వచ్చిపోతుంటారు. స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు కనీసం తాగునీరు కూడా అందివ్వలేని దుస్థితిలో అధికారులున్నారు. స్టేషన్ ఆవరణలో ఉండే కుళాయిలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయే తప్ప చుక్క నీరివ్వడం లేదు. అలాగే మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండడంతో ప్రయాణికులు అత్యవసర సమయంలో నరకం చూస్తున్నారు. అలాగే స్టేషన్‌లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో ప్రయాణికులు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. రైల్వేశాఖ అధికారుల అలసత్వానికి గజపతినగరం రైల్వేస్టేషన్ నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ విషయమై స్టేషన్‌మాస్టర్ రామకృష్ణ వద్ద సాక్షి ప్రస్తావించగా తాగునీటి సమస్య వాస్తవమేనన్నారు. మరుగుదొడ్లకు తాళాలు వేయడం జరిగిందని, ప్రయాణికులు అడిగితే తాళాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకొచ్చారు. స్టేషన్ అభివృద్ధి పనులపై తనకు ఎటువంటి సమాచారం లేదని స్పష్టం చేశారు.



మరుగుదొడ్డి రూమ్‌కు వేసిన తాళం

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గుర్ల: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 90 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 75 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తామన్నారు. మండలంలో 120 మందికి రెండు విడతల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుబాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, టీడీపీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, టి. కిరణ్‌కుమార్, మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

ఎంపీపీ, జెడ్పీటీసీలకు అందని సమాచారం..

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడుకు మండల పరిషత్ అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు.

పాడి రైతులకు పశుదాణా ప్యాకెట్లు

గజపతినగరం: పాడి రైతులకు త్వరలో 50 శాతం రాయితీపై పశుదాణా ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఎ.డి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరంతో పాటు దత్తిరాజేరు, బొండపల్లి మండలాలకు 500 ప్యాకెట్లు రానున్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

కొత్తవలస: మండలంలోని ప్రగతి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ ఉద్యోగమేళాకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ అర్హత కలిగి, 18 – 35 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులు 1224 మంది హాజరయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 388 మందిని ఎంపిక చేశారని కళాశాల డైరెక్టర్ వనుము శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఎ.అరుణ, ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

యోగా శిబిరాలను విజయవంతం చేయాలి

• ఆయుష్ కేంద్రం వైద్యాధికారి సునీత



ఎంపీడీఓతో సమీక్షిస్తున్న వైద్యాధికారి సునీత

బొండపల్లి: యోగాంధ్రలో భాగంగా వచ్చే నెలలో నెల రోజుల పాటు నిర్వహించనున్న యోగా శిబిరాలను విజయవంతం చేయాలని గొట్లాం ఆయుష్‌కేంద్రం వైద్యాధికారి బి.సునీత కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.తులసీదాస్, ఈఓపీఆర్‌డీ ఎ.రఘుపతిరావుతో సమావేశమై శిబిరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి ఉత్సాహవంతులైన ఏడుగురు సభ్యులను ఎంపిక చేసి వారికి పది రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 7 గంటల నుంచి 8 వరకు యోగాపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన వారు గ్రామాల్లోని సచివాలయాలతో పాటు ముఖ్య ప్రదేశాల్లో యోగా శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. యోగా శిబిరాలకు సహకరించాలని ఈ సందర్భంగా ఎంపీడీఓను కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి

వీరఘట్టం: యోగాంధ్ర కార్యక్రమంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమం విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.కృష్ణవేణి సూచించారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై అధికారులతో చర్చించారు. ముఖ్యంగా పాఠశాలల్లో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. శనివారం నుంచి జూన్ 21వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో చేపట్టాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఎస్సై జి. కళాధర్, ఎంఈఓ గౌరినాయుడు, ఆనందరావు, డాక్టర్ ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు ఇంకెన్నాళ్లు..?

• వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రేగిడి లక్ష్మణరావు



రేగిడి లక్ష్మణరావు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం నుంచి గరివిడి వెళ్లే ప్రధాన రహదారిలో చినబంటుపల్లి జంక్షన్ వరకు మరమ్మతులు చేపట్టిన అధికారులు, చినబంటుపల్లి జంక్షన్ నుంచి గరివిడి వరకు మరమ్మతులు ఇంకెన్నాళ్లు చేస్తారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి రేగిడి లక్ష్మణరావు ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ రహదారిలో ఏర్పడిన నిలువెత్తు గోతుల వల్ల పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు, పాలకులకు పట్టకపోవడం దారుణమన్నారు. అసలు రహదారి మరమ్మతులు 2025 సంక్రాంతి లోపు పూర్తి చేస్తామని చెప్పి ప్రారంభించి.. ఇంతవరకు పూర్తి చేయడకపోవడం దారుణమన్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని కోరారు.

ఎండీయూ ఆపరేటర్లకు న్యాయం చేయాలి



దత్తిరాజేరు: డీటీ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

దత్తిరాజేరు: ప్రతి నెలా ఇంటి వద్ద రేషన్ ఇచ్చే ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వం ఆపరేటర్లు, హెల్పర్ల పొట్ట కొట్టిందని ఆపరేటర్లు ఎస్. దుర్గాప్రసాద్, పి. చంటి, బి. బలరాం, ఎ. హరికృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా, వరదల సమయంలో కూడా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందించామన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో మండలంలోని 16 మంది నిరుద్యోగులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని రద్దు చేసుకోవాలని కోరారు.



వేపాడ: తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేస్తున్న ఎండీయూ నిర్వాహకులు

ఉద్యోగ భద్రత కల్పించండి..

వేపాడ: లబ్ధిఆరులకు బియ్యం, రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లను నిలుపుదల చేయడం సరికాదని.. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుని ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రాములమ్మను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 9,269 కుటుంబాలకు నష్టం జరుగుతుందన్నారు. తమను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



వైభవంగా స్నపన తిరుమంజనం..

వేపాడ మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజన సేవ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి పంచామృతాభిషేకం, సుగంధద్రవ్య అభిషేకం, నక్షత్ర, కర్పూర, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. – వేపాడ



హెచ్‌ఐవీపై అవగాహన

ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎస్.కోట పెద్దవీధిలోని రామాలయం వద్ద వీధి నాటకం ద్వారా హెచ్‌ఐవీపై శుక్రవారం అవగాహన కల్పించారు. వ్యాధి సోకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. రోగులతో ఎలా మెలగాలో వివరించారు. కార్యక్రమంలో పలువురు ఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు. – శృంగవరపుకోట

ఉపాధి వేతనదారుల వినూత్న నిరసన



నోటి వద్ద మట్టి పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న వేతనదారులు, నేతలు

శృంగవరపుకోట: సకాలంలో బిల్లులు చెల్లించకపోతే ఏం తిని బతకాలని ఉపాధి వేతనదారులు ప్రశ్నించారు. ఈ మేరకు కిల్తంపాలెం పంచాయతీ పరిధి వాకాడ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు గాడి అప్పారావు, మద్దిల రమణ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. దీనిలో భాగంగానే ఎన్ఎంఎంఎస్ యాప్ తీసుకురావడం.. రెండు పూటలా పని.. బిల్లులు చెల్లించకపోవడం వంటి నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. 15 రోజుల్లో పేమెంట్ చేయాల్సి ఉండగా.. నేటికి తొమ్మిది వారాల బిల్లులు బకాయి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం మేట్లకు నెలకు 7500 రూపాయల జీతం ఇస్తామని చెప్పి ఇంతవరకు ఆ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఏడాదిలో 200 రోజులు పని కల్పించడంతో పాటు రోజుకు రూ. 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీర్రాజు, నాగరాజు, సన్యాసమ్మ, గణేష్, లక్ష్మి, చంద్రరావు, భారతి, కొండమ్మ, పోలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

గుర్ల: కోరుకొండ సైనిక‌స్కూల్ ప్రవేశ పరీక్షలో మండలంలోని గుజ్జింగివలసకు చెందిన అట్టాడ కీర్తిప్రియ ప్రతిభ కనబరిచింది. 300 మార్కులకు గాను 249 మార్కులు సాధించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు అప్పలరాజు, సంధ్యారాణి చిన్నారిని అభినందించారు.



అట్టాడ కీర్తిప్రియ

268 మార్కులు..



ప్రీతమ్ పునీత్

చీపురుపల్లి: సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండలంలోని పర్ల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి జి.ప్రీతమ్ పునీత్ చక్కని ప్రతిభ కనపరిచాడు. ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఎన్‌టీఏ వెల్లడించిన ఫలితాల్లో ప్రీతమ్ పునీత్ 300 మార్కులకు గాను 268 మార్కులు సాధించాడు. దీంతో ఆ పాఠశాల హెచ్‌ఎం సత్యంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. నెలిమర్ల మండలంలోని బొప్పడాం గ్రామానికి చెందిన ప్రీతమ్ పునీత్ తండ్రి కేశవనాయుడు ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. దీంతో ఆయన పని చేసే పాఠశాలలోనే కుమారుడు ప్రీతమ్ చదివిస్తున్నాడు.

257 మార్కులు..



శరణ్‌తేజ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఆల్ ఇండియా స్థాయిలో జరిగిన సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఫలితాల్లో గరివిడి పట్టణంలోని గర్భాం రోడ్డులో నివాసం ఉంటున్న విద్యార్థి జట్ల శరణ్‌తేజ ప్రతిభ కనబరిచాడు. ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్ 5న ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించగా ఈ నెల 22న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో విద్యార్థి శరణ్‌తేజ 300 మార్కులకు గాను 257 మార్కులు సాధించి ప్రవేశానికి అర్హత సాధించాడు.

12 మంది అర్హత..



ఎస్.కోట: అర్హత సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఎస్.కోటలోని డాక్టర్ వరలక్ష్మి స్కూల్ విద్యార్థులు ప్రతిభ సాధించినట్లు యాజమాన్యం కోలపర్తి రాజేంద్ర ప్రసాద్, వరలక్ష్మి తెలిపారు. పాఠశాలకు చెందిన 12 మంది ప్రవేశాలకు అర్హత సాధించారని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను ప్రిన్సిపాల్ వై. జానకీదేవి, తదితరులు అభినందించారు.

బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా..

• వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: నాపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు అప్పలనాయుడును దత్తిరాజేరు మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు ఇంటి వద్ద ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, తదితరులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. రైతులను కలుపుకుని పోరాటం చేయాలని అప్పలనాయుడుకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మండల శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు

• కానరాని మౌలిక సదుపాయాలు

• ఇబ్బంది పడుతున్న జగనన్న కాలనీ వాసులు
• పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఎన్‌జీఆర్ పురం జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట, ఎన్‌జీఆర్ పురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీల్లో రోడ్లు సరిగా లేకపోవడంతో పాటు రక్షిత మంచి నీటి పథకాలు ఏర్పాటు చేసినా వాటికి కనెక్షన్‌లు ఇవ్వలేదు. దీంతో తాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని పురిటిపెంట, ఎన్‌జీఆర్ పురం కాలనీ వాసులు కోరుతున్నారు.



దిష్టిబొమ్మలా ఉన్న రక్షిత మంచి నీటి పథకం